క్లుప్తంగా

నియామకం



సంగెం : బీజేపీ మండల ఇన్‌చార్జ్‌గా పగడాల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ఇంటింటికి తీసుకుని వెళ్లి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, విజయచందర్‌రెడ్డి, ముల్క ప్రసాద్, క్రాంతి కుమార్, గోదాసి చిన్న, బుట్టి కుమారస్వామి పాల్గొన్నారు.

కార్యదర్శుల నిరసన



నల్లబెల్లి : ప్రొబేషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేపీఎస్‌ల సంఘం నాయకులు శ్రవణ్, విష్ణు మాట్లాడుతూ తమ పెండింగ్ సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రహీం, శ్రీకాంత్, యాదగిరి, జ్యోతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ఖానాపురం : మండలంలోని చిలుకమ్మనగర్‌కు చెందిన మహిళ మనస్తాపంతో మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చిలుకమ్మనగర్‌కు చెందిన రేణుక(35) ఇంటి పక్కన వారితో తగాదా పడింది. ఇరువురు దూషించుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు. ఇదే విషయంపై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్..



ఆగారెడ్డి (ఫైల్)

సంగెం : మండలంలోని కాట్రపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తుమ్మ ఆగారెడ్డి (75) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. వరంగల్‌లోని కొత్తవాడలోని ఆయన స్వగృహంలో ఆగారెడ్డి పార్థీవదేహంపై పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాట్రపల్లి సర్పంచ్‌గా ఆయన 1970 నుంచి 1995 వరకు 25 ఏళ్లపాటుగా గ్రామాభివృద్ధికి సేవలందించారు. గ్రామానికి చేసిన సేవలకు స్మరించుకుని ఆయన ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ పూలుగు సాగర్‌రెడ్డి, వైఎస్సార్ టీపీ మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్‌తో పాటుగా పలువురు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీకి గాయాలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కోపాకుల చెరువు సమీపంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీ వీరమల్ల దిలీప్ కాలుపై గడ్డపార పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తోటి కూలీలు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పని చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గడ్డపార పడి గాయపడిన దిలీప్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని కూలీలు కోరారు.

‘కంటి వెలుగు’ ప్రారంభం

గీసుకొండ : మండలంలోని ఆరెపల్లిలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి జాబిల్లి, సూపర్‌వైజర్ ఎ.స్వరూప, అప్తాల్మిక్ అసిస్టెంట్ ప్రేమ్‌రాజ్, డీఏఓ ఖాజా మోయినుద్దీన్, ఏఎన్‌ఎంలు కృష్ణవేణి, కల్పన, సర్పంచ్ వాడికారి జ్యోతి, పంచాయతీ కార్యదర్శి దినేశ్, ఆశ కార్యకర్త శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పండుగ

చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాలో సోమవారం రాత్రి గిరిజనులు దుర్గమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో గిరిజన మహిళలు బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ బాదావత్ రజిత,ఉప సర్పంచ్ విజేందర్, వార్డు సభ్యులు బిక్కు రాజు, భద్రు, గోవింద్, లావుడ్య భద్రు ఉన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

గూడూరు : ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న వీఓఏలను ప్రభుత్వ సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి. ఖాసీం కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట మండల వీఓఏలు చేపట్టిన సమ్మెకు మంగళవారం ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఖానాపురం: ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సోమయ్య

ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నెక్కొండ: షాదీఖానాలో రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని షాదిఖానాలో మంగళవారం ముస్లింలకు రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లను అందించి, మాట్లాడారు. అన్ని మతాల పండులకు సీఎం కేసీఆర్ సమప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అలాగే మండలంలోని అలంకానిపేట, రెడ్లవాడ రైతు వేదికల్లో గతేడాదిలో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ వెంకన్న, ఎంపీపీ జాటోత్ రమేష్‌నాయక్, పీఏసీఎస్ చైర్మన్‌లు మారం రాము, జగలం సంపత్‌రావు, ఏఓ నాగరాజు, సర్పంచ్‌లు మాదాసు అనంతలక్ష్మి, రావుల శ్రీలత, మాలోత్ పూర్ణ, లావడ్యా హరికిషన్, జల్లె సుదర్శన్, ఎంపీటీసీలు సంగని సూరయ్య, మాలోత్ రవి, కర్నూరపు శ్రీనివాస్, నాయకులు రవీందర్‌రెడ్డి, భద్రయ్య, చంద్రయ్య, ప్రసాద్, సోమయ్య, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు దుస్తుల పంపిణీ

ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డ గ్రామంలో మంగళవారం ముస్లింలకు సర్పంచ్ వల్లెపు సోమయ్య ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ చాలా పవిత్రమైందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మస్తాన్, సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్, ముస్లింలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆర్డీఓ శ్రీనివాసులు

చెన్నారావుపేట : మండలంలోని జల్లీ గ్రామంలో గల మసీద్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు పండ్లు తినిపించుకుంటు ఉపవాసం విడిచారు. అనంతరం ఇఫ్తార్‌లో భాగంగా విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీపీ విజేందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ రఫి, తహసీల్దార్ బన్సిలాల్, డీటీ మధుసూదన్, బీఆర్ఎస్ మండల నాయకుడు తొగరు చెన్నారెడ్డి, ఆర్ఐ స్వామి, యాకూబ్ పాషా, సుభాన్, నిజామ్, ముస్లింలు, వీఆర్ఏలు రాజు, రాజశేఖర్, శివ, ఉన్నారు.

అల్లా.. చల్లగా చూడాలి

ప్రతీ ఒక్కరిని అల్లా.. చల్లగా చూడాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మసీద్‌లోని ఇఫ్తార్ విందులో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముస్లింల పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు అండగా ‘సఖి’



గీసుకొండ : సమాజంలో వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలకు అండగా సఖి కేంద్రాలు ఉన్నాయని సోషల్ కౌన్సెలర్ నూర్జహాన్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ నగరం గరీబ్‌నగర్, కీర్తినగర్‌లలో క్రాంతి, నవతెలంగాణ ఎస్ఎల్ఎఫ్ గ్రూప్ సమావేశంలో ఆమె మహిళలకు పలు సూచనలు చేశారు. మహిళలు తమ హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అత్యవసర పరిస్థితిలో హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేస్తే వెంటనే స్పందించి సహాయం అందిస్తామన్నారు. సఖి సెంటర్ ఆర్‌పీలు శైలజ, రమాదేవి, కేస్ వర్కర్ సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



నర్సంపేట : ‘ఆలోచన అంబేడ్కర్‌ది.. ఆచరణ మనది కావాలి’ అనే పుస్తకాన్ని బొజ్జ తారకం రచించారు. ఈ మేరకు బొజ్జ తారకం ట్రస్ట్ చైర్మన్ బి.విజయభారతి, బొజ్జ మహిత పుస్తకాన్ని ముద్రించగా నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు

సంగెం : మండలంలోని తీగరాజుపల్లి మత్స్య పారిశ్రామిక సంఘంలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టడంతోపాటు, దాడి చేసిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్‌నాయుడుకు ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర కమిటీ సభ్యుడు బి. రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు నీరటి రాజు మాట్లాడారు. తీగరాజుపల్లి సంఘంలో కొంతకాలంగా అవినీతి, అవకతవకలు జరుగుతున్నాయని, వీటిని ప్రశ్నించినందుకు సంఘం కార్యదర్శిగా పనిచేస్తున్న బండారి రాము, సభ్యులు ఎలబోయిన రాములుపై సంఘం అధ్యక్షుడు హంస సంపత్‌తోపాటు మరికొందరు దాడి చేశారని తెలిపారు. దీనిపై సంగెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారిని సంఘం నుంచి వెలివేశారని, చెరువులో వాటా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విచారణ చేసి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రాన్ని కార్యాలయ సిబ్బంది విల్సన్‌కు అందజేశారు. మెపా సభ్యులతో పాటుగా బాధితుడు రాము ఉన్నారు.

సమ్మేళనాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాయపర్తి : మండలంలోని బంధన్‌పల్లి, కొత్తూరు, ఏకే తండా, సూర్యతండా గ్రామాలలో త్వరలో నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, పూస మధు, గుగులోత్ జాజునాయక్, మాలోత్ వసుంధర్, గారె కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డలు అండగా నిలవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, స్వప్న తదితరులు

నల్లబెల్లి : ఆడబిడ్డలు ఆశీర్వదిస్తూ రాజకీయంగా తనకు అండగా నిలవాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో నిర్వహించిన డివిజన్ స్థాయి మహిళా క్రీడోత్సవాల్లో గెలుపొందిన విజేతలకు.. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు పారితోషికంతో పాటు బహుమతులు అందించారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నియోజకవర్గంలోని మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, ఎంపీపీ ఊడుగుల సునీత, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, తహసీల్దార్ దూలం మంజుల, ఎంపీడీఓ విజయ్ కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి, ఏపీఎం సునీత, టీఆర్ఎస్ నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, బానోత్ సారంగపాణి, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, నానబోయిన రాజారాం, జన్ను జయరావు, గొనేల పద్మ పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఆదర్శం.. నర్సంపేట మహిళలు

దుగ్గొండి : నర్సంపేట మహిళల చైతన్యం తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చిలో నిర్వహించిన క్రీడలలో గెలుపొందిన మహిళా క్రీడాకారులకు ఆయన మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళా క్రీడోత్సవాలలో నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా 8వేల మంది పాల్గొన్నారని ఇది చరిత్ర అన్నారు. దుగ్గొండి మండలంలో 8వందల మంది మహిళలు ఆటల్లో పాల్గొన్నారన్నారు. వారందరికి బహుమతులు అందించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా 5 వేలమంది మహిళలకు ప్రభుత్వ ఖర్చుతో కుట్టు శిక్షణ ఇప్పించి ఉచితంగా మిషన్ అందించడంతో పాటు టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగంలో చేర్పిస్తామని ఆయన వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి నర్సంపేట పౌరుషాన్ని రాష్ట్రానికి చాటి చెప్పిన ప్రతి మహిళకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి రజిత, ఏపీఎం రాజుకుమార్, తోకల నర్సింహారెడ్డి, సుకినె రాజేశ్వర్‌రావు, సీసీలు, వీఓఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మసీదులో రంజాన్ మాసం సందర్భంగా ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న దుస్తులను పంపిణీ చేశారు. ఎండీ అక్బర్, మైనోద్దీన్, రహీమ్, యాకూబ్, పాషా, సలీం, రసూల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అసత్య ప్రచారాలు తగవు

దామెర : బీఆర్ఎస్ పార్టీ చేసే అసత్య ప్రచారాలు తగవని, మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాష్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరినట్లు అసత్య ప్రచారం చేస్తున్నట్లు విమర్శించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ఆయన వెంట వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, దామెర ఉపసర్పంచ్ హింగె నాగేశ్వర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, నాయకులు పోచయ్య, నగేష్, రాజకొమురయ్య తదితరులు ఉన్నారు.

‘పంచాయతీ కార్యాలయానికి తాళం’

- విధులను అడ్డుకున్న సర్పంచ్ కుటుంబీకులు
- పోలీస్ స్టేషన్‌లో కార్యదర్శి ఫిర్యాదు

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని ఇస్లావత్ తండాలో గ్రామపంచాయతీ కార్యాలయానికి సర్పంచ్ ఇస్లావత్ రమేశ్ కుటుంబ సభ్యులు తాళం వేశారు. విధుల నిర్వహణలో భాగంగా హాజరైన పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని మంగళవారం సర్పంచ్ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. కాగా, ఉపసర్పంచ్ సంతకాన్ని సర్పంచ్ రమేశ్ ఫోర్జరీ చేసినట్లు అధికారులకు ఫిర్యాదు చేయగా ఈనెల 13వ తేదీన మండల అధికారులు విచారణ చేపట్టారు. దీంతో విచారణ సమయంలో గొడవ జరిగింది. సర్పంచ్ ఇస్లావత్ రమేష్ తన బంధువుల ఇంట్లో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ కార్యాలయానికి విధులు నిర్వహించేందుకు పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని రాకుండా అడ్డుకుని తాళం వేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి కృష్ణంరాజు ఎంపీడీఓ, ఎంపీఓకు సమాచారం అందించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ కుటుంబ సభ్యులు విధులకు ఆటంకం కలిగించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా



దివ్యాంగులకు బస్‌పాస్ అందజేస్తున్న బాధ్యులు

చెన్నారావుపేట : దివ్యాంగులు బస్‌పాస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ తొప్పెట రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగాపురం గ్రామంలో మంగళవారం దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ విజయ మాధురి సహకారంతో బస్‌పాస్ మేళా నిర్వహించామన్నారు. ఆర్టీసీ బస్‌లలో 50 శాతం రాయితీతో సురక్షిత ప్రయాణం చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ రిలేషన్ కోఆర్డినేటర్ దేవేందర్, బస్‌పాస్ కోఆర్డినేటర్లు సోమ మాధవ్, బొమ్మెర కిరణ్, బూర ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ రామేషం, లక్ష్మీనారాయణ, రాములు తదితరులు ఉన్నారు.

ప్రతీ కులానికి కమ్యూనిటీ భవనం



ప్రొసీడింగ్ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి : వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని ప్రతి గ్రామంలో ప్రతీ కులానికి కమ్యూనిటీ భవన నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటలో గీతపారిశ్రామిక సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం ప్రొసీడింగ్ పత్రాన్ని సంఘం సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుగులోత్ రాజునాయక్, ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏరుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



నివాళులర్పిస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు మట్టి పెళ్లలు మీదపడి మృతి చెందిన జీపీ కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని జీపీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో మృతి చెందిన వీణవంక శంకర్ మృతదేహాన్ని వెంకటయ్య సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో చనిపోయిన పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. జీపీ కార్మికుల పట్ల వివక్షను విడనాడి న్యాయం చేయాలన్నారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అబ్బదాసి అశోక్, ముస్కు రాజు, గంగాడి అశోక్ రెడ్డి, పుట్టపాక రాజేందర్, లోనె తిరుపతి, కొత్తపల్లి రమణాచారి, శ్రీరామోజు భిక్షపతి, రాంబాబు, భగవాన్ రెడ్డి, యాకయ్య పాల్గొన్నారు.

సంతలో సౌకర్యాలు కరువు



రోడ్డుపై నిర్వహిస్తున్న సంత


- ఎండాకాలంలో తాగునీటికి కటకట
- మరుగుదొడ్లు లేక ఇబ్బందులు
- పట్టించుకోని పంచాయతీ పాలకులు



సంతలో కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులు

నల్లబెల్లి : వ్యాపారానికి అడ్డాగా మారిన మండల కేంద్రంలోని సంత(అంగడి)లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. నల్లబెల్లి ప్రధాన రోడ్డుపై ప్రతి సోమవారం సంత నిర్వహిస్తారు. ఎండ, వానను తట్టుకొని చిరు వ్యాపారులు వ్యాపారం నిర్వహిస్తున్నారు. సంతలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు. మండలంలోని రైతులు, సమీప మండలాల నుంచి చిరు వ్యాపారులు ఈ సంతకు వస్తారు. నిబంధనల మేరకు చిరువ్యాపారులు పన్ను చెల్లిస్తున్నా.. సంతను వేలంపాటలో టెండర్ సొంతం చేసుకున్నా వ్యక్తి కనీసం నీటి సౌకర్యం కల్పించడం లేదు. ఈ విషయాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో సంతకు వచ్చే వినియోగదారులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. సరుకులు అమ్ముతున్న సమయంలో వర్షం వస్తే.. తడుస్తూ, ఎండకు వడదెబ్బకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిఏటా తైబజారు వేలం ద్వారా ఆదాయం సమకూరుతున్నా కనీస సదుపాయాలు కల్పించడంలేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తాపానికి తట్టుకోలేక డేరాలు వేసుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించి సంతలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సంతకు వచ్చే ప్రజలు, చిరు వ్యాపారులు కోరుతున్నారు.


తాగునీరు అందించాలి



సంతలో ఎండవేడిమికి తట్టుకోలేక పోతున్నాం. వేలంలో సంత టెండర్‌ను సొంతం చేసుకున్న వ్యక్తి పన్నులు వసూలు చేస్తున్న కనీసం తాగునీటిని ఏర్పాటు చేయడంలేదు. మంచినీటిని ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- సమ్మయ్య, చిరు వ్యాపారి

సౌకర్యాలు కల్పిస్తాం..



సంతలో సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. వేలంలో సంత టెండర్‌ను సొంతం చేసుకున్న వ్యక్తితో తాగునీటి వసతి కల్పించాలని సూచించాం. మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

- కూచన ప్రకాశ్, మండల పంచాయతీ అధికారి

విద్యార్థుల సంఖ్యను పెంచాలి



చెన్నారావుపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మండల నోడల్ ఆఫీసర్ ఉండ్రాతి సుజన్ తేజ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని ఖాదర్‌పేట, పాపయ్యపేట, అమృతండా పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మన ఊరు–మన బడి అభివృద్ధి పనులను పరిశీలించారు. పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ నెల 24న ప్రతి పాఠశాలలో పేరెంట్, టీచర్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్ రికార్డులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, కట్టస్వామి, కుమారస్వామి, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు ఉమాశంకర్, వెంకటేశ్వర్లు, శ్యామ్, సుందర్, వెంకన్న ,సీఆర్‌పీ సంపత్, ఎస్‌ఎంసీ చైర్మన్ యాకూబ్ ఉన్నారు.